
# కొడంగల్ ఎత్తిపోతలకు భూసేకరణ ప్రారంభం

దుద్యాల్, జులై 2, ప్రభాతవార్త: నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం కాలువ నిర్మాణానికి దుద్యాల మండల కేంద్రం పరిధిలో భూసేకరణ ప్రారంభమైంది. తహసిల్దార్ కిషన్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఏఈ కిషోర్, మోమిన్ పెట్ సర్వేయర్ శ్రీనివాస్, పూడూర్ సర్వేయర్ దేవేందర్‌ల బృందాలు, ఆర్ఐ నవీన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, జిపిఓలు పకీరప్ప, శ్రీనివాస్, గోపాల్‌లు సంబంధిత సర్వే నంబర్ల రైతుల సమక్షంలో భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. మండల కేంద్రానికి సంబంధించిన 65 ఎకరాల 2 గుంటలకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. తక్కువ విస్తీర్ణం ఉన్న రైతుల భూముల మధ్య నుండి కాలువ వెళ్లడం ద్వారా మిగతా భూమి నిరుపయోగంగా మారుతుందని సర్వే నెంబర్ లో ఒక వైపు నుండి కాలువ తీయాలని కొందరు, పరిహారం ప్రకటించక ముందే సర్వే నిర్వహించడం పై కొంతమంది రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే అనంతరం గ్రామసభ నిర్వహించి పరిహారం గురించి రైతులతో పై అధికారులు చర్చిస్తారని ఎమ్మార్వో కిషన్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేర్గు వెంకటయ్య, ఖాజ, శ్రీశైలం, వెంకటయ్య, రమేష్, బసిరెడ్డి, ఖలీల్ రైతులు గోపాలకృష్ణ, అయ్యుబ్, రాజు, మోహన్, మల్లేశం, పెంటప్ప, అద్నాన్, రాములు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న అధికారులు



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# ముంచుకొస్తున్న నీటి గండం?

## వికారాబాద్ జిల్లాలో సగానికి పైగా మండలాల్లో వర్షపాత లేమి ★ఎండిపోతున్న జలవనరులు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త: జిల్లాలో ఈ ఏడాది నీటి ఎద్దడి ముంచుకు వచ్చే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఎలినినో ప్రభావం వల్ల ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంఘం తాజా గణాంకాల ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 మండలాల్లో సగానికి పైగా మండలాలు తీవ్ర వర్షపాత లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

**గణాంకాలు చెబుతున్న భయానక నిజాలు**

జిల్లా సగటు వర్షపాతం సాధారణంగా 121.6 మి.మీ కురియాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 106.5 మి.మీ మాత్రమే నమోదై, మైనస్ 12 శాతం లోటు కనిపిస్తోంది. అయితే, అంతర్గతంగా మండలాల వారీగా పరిశీలిస్తే పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది.

జిల్లాలోని నాలుగు మండలాలు తీవ్రమైన వర్షపాత క్షీ ణతను ఎదుర్కొంటున్నాయి. బంట్వారం (87), పెద్దేముల్ (88), బషీరాబాద్ ( 80), కొడంగల్ (72) మండలాల్లో వర్షాలు లేక పరిస్థితి దారుణంగా తయారైంది. మరో ఆరు మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. మార్పల్లి (36), కుల్క చర్ల (59), ధారూర్ (29), కోటపల్లి (27), తాండూర్ (31), దౌలతాబాద్ (36) మండలాలు ఎండల ప్రభావానికి, నీటి కొరతకు వేదికవుతున్నాయి. నవాబ్‌పేట్, పరిగి, దోమ, యాలాల మం డలాలు సాధారణ స్థితిలో ఉండగా.. మోమిన్‌పేట్, వికా రాబాద్, పుదూర్, బొంరాస్‌పేట, చౌడాపూర్, దుద్యాల్ వంటి కొన్ని మండలాల్లో మాత్రమే మెరుగైన వర్షపాతం నమోదైంది. గత మే మాసంలో 14.06 మీటర్లకు పడిపోయిన భూ గర్భ నీటి మట్టం, ఇటీవల కురిసిన స్వల్ప వర్షాలకు కేవ లం ఒకే ఒక్క మీటరు పెరిగి ప్రస్తుతం 13 మీటర్ల లోతులో ఉంది.



ఎండుముఖం పట్టిన కాగ్నా నది

**నీటిని పొదుపుగా వాడండి : ఏడీ**

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటిని పొదు పుగా వాడుకోవాలని జిల్లా భూగర్భజలవనరుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎలినినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదు కావచ్చన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నీటిని వృథా చేయొద్దని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో ఒక మీటరు నీటి మట్టం పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం భూగర్భంలో 13 మీటర్ల లోతులో నీటి మట్టం ఉందని ఆయన వివరించారు.

**నిరుడు సాధారణం కంటే అధికంగా కురిసినా..**

నిరుడు కూడా ఇదే విధమైన భూగర్భ జల నీటి మట్టాలు నమోదయ్యాయి. జూలైలో 155 మిల్లీమీటర్లు, ఆగస్టులో 231 మిల్లీమీటర్లు, సెప్టెంబరులో 182 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. జిల్లాలోని 20 మండలాల్లో దాదాపు సగం గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిరుడు సాధారణం కంటే అధిక వర్షాలు కురిసినప్పటికీ జనవరి నుంచి భూగర్భజలాలు పడిపోయాయి. దుద్యాల మండలంలో వేసవిలో 29 మీటర్లు, మర్పల్లిలో 23, కోటపల్లిలో 20 మీటర్లకు పడిపోవడం ఆందోళన గురి చేసింది.

**అడుగంటిన 60 శాతం బోరు బావులు**

రాబోయే మూడు నెలల్లో ఆశించిన వర్షాలు కురవకపోతే నీటి మట్టాలు మరింత పాతాళానికి పడిపోవడం ఖాయం. ఇప్పటికే జిల్లాలోని 60 శాతం బోరు బావులు పూర్తిగా అడుగంటాయి. సాధారణంగా అరగంటలో నిండాల్సిన మంచినీటి ట్యాంకులు గంటల సమయం గడుస్తున్నా నిండటం లేదని మున్సిపల్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల మోటార్లు ఎక్కువ సమయం నడపాల్సి వచ్చి విద్యుత్ బిల్లుల భారం కూడా అదనంగా పడుతోంది. కాగ్నా నదితో పాటు జిల్లాలోని మూడు మధ్యతరహా ప్రాజెక్టులు, >>4



పొలంలోకి ప్రవహించిన మిషన్ భగీరథ నీళ్లు

# వృథా! వేల లీటర్ల నీరు

## మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీక్
## స్వచ్ఛమైన తాగునీరు రోడ్లపాలు
## పొలాల్లోకి ప్రవహించటంతో పంటలకు చేటు
## నీటిని బయటకు మళ్లించటానికి వ్యయప్రయాసలు
## మరమ్మతులు చేస్తున్నా వరుస లీకేజీలపై అనుమానాలు

ధారూర్, జులై 2, ప్రభాతవార్త: ధారూర్ మండలంలో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల పనులు కాగితాలకే పరిమితమవుతున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని దోర్నాల నుండి నాగారం, నాగారం నుండి మోమిన్‌కూర్దు గ్రామాల మధ్య ప్రధాన పైపులైన్ పదేపదే లీకేజీలకు గురవుతుండటంతో వేల లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు వృథాగా రోడ్లపాలవుతోంది. ఈ పరిస్థితి వల్ల అటు సాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు, ఇటు తాగునీటి కష్టాలతో సతమతమవుతున్న ప్రజలకు తీరని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పైపులైన్ లీకేజీ కారణంగా వృథాగా పారుతున్న నీరంతా పక్కనే ఉన్న రైతుల పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో అకాలంగా పంటలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొలాల్లోకి చేరుతున్న నీటిని బయటకు పంపడానికి సొంత డబ్బులు ఖర్చు చేసి కాలువలు తీయాల్సి వస్తోందని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక మరమ్మతులే కారణమా..?

పైపులైన్ లీకేజీ అయిన ప్రతిసారి అధికారులు నామమాత్రపు మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరమ్మతులు చేసిన రెండు, మూడు రోజులకే మళ్ళీ లీకేజీలు >>2



లీకేజీ నీరు పొలంలోకి రాకుండా కాలువను తవ్విన రైతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

# ఆయిల్ పామ్‌పై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించండి

వికారాబాద్, ప్రభాతవార్త : ఆయిల్ పామ్ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయం, ఉద్యానవన శాఖ, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు లభించే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సాగు విధానాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, కొనుగోలు విధానం వంటి అంశాలపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, వారికి సాంకేతిక సలహాలు, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని చెప్పారు. రైతు ఆయిల్ ఫామ్ క్షేత్ర సందర్శన, ఆయిల్ పాం కంపెని సందర్శన చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని, సాగు విస్తీర్ణం పెంచేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులకు షేర్ చేయాలని కోరారు.

# ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నిషేధిత కెమికల్స్

## గడువు ముగిసిన పదార్థాలు
## ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిర్వహణ
## ఎస్ఓటీ తనిఖీలో బయటపడిన అక్రమాలు..

మేడ్చల్, జులై 2. ప్రభాతవార్త : వేగంగా అభివృద్ధి చెందుతున్న మేడ్చల్ సర్కిల్ పరిధిలో విద్యాసంస్థలు, ఇంజినీరింగ్ కళాశాలలు, అపార్ట్‌మెంట్లు, కొత్త కాలనీలు వెలువడి ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఇక్కడి బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై ఆధారపడుతున్నారు. ఇదే అవకాశంగా భావించిన కొందరు వ్యాపారులు నాణ్యతను పూర్తిగా పక్కన పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. అత్యధిక ధరలు వసూలు చేస్తూ, అత్యంత నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేయడం, గడువు ముగిసిన వస్తువులను మళ్లీ వినియోగించడం, నిషేధిత రసాయనాలు కలపడం, పరిశుభ్రత పాటించకపోవడం ఇప్పుడు మేడ్చల్‌లో బహిరంగ రహస్యంగా మారాయి.



మేడ్చల్ మార్కెట్‌లోని శ్రీకృష్ణ బేకరీపై ఎస్ఓటీ అధికారులు చేసిన ఆకస్మిక దాడిలో బయటపడిన అంశాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిర్వహణ. గడువు ముగిసిన రంగులు, ఫ్లేవర్లు, షుగర్ సిరప్స్ వినియోగం, కేక్ తయారీలో >>2



కొడంగల్ డంపింగ్ యార్డులో ఇసుకను దింపుతున్న లారీ

# నంబర్ ఒక్కటే.. లారీలు రెండు..!

## ఆంధ్రా టూ కొడంగల్‌కు అక్రమ ఇసుక రవాణా
## నకిలీ నంబర్ ప్లేట్లతో మాఫియా మాయాజాలం
## కొడంగల్‌లో రెండు లారీలు సీజ్ - రూ.1.75 లక్షల ఫైన్

కొడంగల్, జులై 2, ప్రభాతవార్త : నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఇసుక రవాణా చేయడమే కాకుండా, పోలీసుల కళ్లు గప్పేందుకు ఇసుక మాఫియా సరికొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఒకే నంబర్ ప్లేట్‌తో రెండు వేర్వేరు లారీలను నడుపుతూ అధికారులను బురిడీ కొట్టించే ప్రయత్నం కొడంగల్‌లో కలకలం రేపింది. ఒక లారీని ఆర్టీఓ అధికారులు సీజ్ చేసిన 24 గంటల వ్యవధిలోనే, అదే నంబరుతో ఉన్న మరో లారీ ఇసుక లోడుతో ప్రత్యక్షం కావడం ఇక్కడి అక్రమ రవాణా నెట్‌వర్క్ ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోంది. అసలేం జరిగిందంటే..?ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోని కొడంగల్ ప్రాంతానికి ఎలాంటి అనుమతులు, వేబిల్లులు లేకుండా భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఏపీకి చెందిన కొందరు ఇసుక వ్యాపారులు స్థానిక వ్యాపారులతో చేతులు కలిపి తాండూర్ రోడ్డులోని ఒక డెంపింగ్ యార్డులో ఈ ఇసుకను నిల్వ చేస్తున్నారు.

**రెండు రోజుల క్రితమే పట్టివేత**

రెండు రోజుల క్రితం ఎపి39డబ్ల్యూఇ1346 అనే నంబర్ గల లారీ అక్రమంగా ఇసుకను అన్‌లోడ్ చేస్తుండగా స్థానిక లారీ అసోసియేషన్ సభ్యులు పట్టుకున్నారు. మొదట పోలీసులు జోక్యం చేసుకుని లారీని వదిలేయాలని ఒత్తిడి తెచ్చినప్పటికీ, సభ్యులు పట్టుబట్టి ఆర్టీఓ అధికారులకు ఫిర్యాదు చేశారు. పత్రాలను పరిశీలించిన అధికారులు అనుమతులు లేవని తేలడంతో సదరు లారీకి రూ. 1,75,000 భారీ జరిమానా విధించి సీజ్ చేశారు.

**మరుసటి రోజే అదే నంబరుతో ఇంకో లారీ**

ఈ ఘటన మరువక ముందే, సరిగ్గా 24 గంటల వ్యవధిలో అదే ఎపి39డబ్ల్యూఇ1346 నంబర్ ప్లేట్‌తో ఉన్న మరో లారీ అదే డంపింగ్ యార్డులో ఇసుక దించుతూ కనిపించింది. దీన్ని గమనించిన లారీ అసోసియేషన్ సభ్యులు షాక్‌కు గురయ్యారు. పట్టుబడిన లారీ నంబర్ ప్లేట్‌ను మార్చి, మరో లారీకి తగిలించి ఈ అక్రమ దందా సాగిస్తున్నట్లు వారు గుర్తించారు.

ఇంత భారీ స్థాయిలో అక్రమ రవాణా సాగుతుండటం వెనుక స్థానిక అధికారుల సహకారం కూడా ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ మోసం వెలుగుచూడటంతో లారీ అసోసియేషన్ అధ్యక్షులు బాల్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు అత్యవసరంగా సమావేశమై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక రవాణాకు కేంద్రంగా మారిన తాండూర్ రోడ్డులోని డంపింగ్ యార్డును వెంటనే సీజ్ చేయాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులతో పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు

# గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌లో ముసలం

## ★డివిజన్ అధ్యక్షుని నియామకంపై దుమారం ★పార్టీ కోసం పనిచేయని వారికి బాధ్యతలు అప్పగించారని ఆరోపణ ★నిరంతరం శ్రమించిన నాయకులను విస్మరించారని ఆవేదన
## ★డిసిసి చీఫ్‌కు మూకుమ్మడిగా రాజీనామా లేఖలు



పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్, జులై 2, ప్రభాతవార్త : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ తాజాగా డివిజన్ల వారీగా అధ్యక్షులను ప్రకటించింది. మేడ్చల్ డివిజన్‌కు చాపరాజు, కిష్టాపూర్-పూడూర్ డివిజన్‌కు మల్లేష్ గౌడ్, గుండ్లపోచంపల్లి డివిజన్‌కు సురేందర్ ముదిరాజ్‌లను అధ్యక్షులుగా నియమించింది. అయితే మిగతా డివిజన్లలో నియామకాలు ప్రశాంతంగా సాగగా, గుండ్లపోచంపల్లి డివిజన్‌లో మాత్రం ఈ నియామకం తీవ్ర వివాదానికి దారితీసింది. ఏళ్లుగా ఒకే మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో కొనసాగిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పరిపాలనా మార్పులకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరిస్తూ డివిజన్ల వారీగా అధ్యక్షులను నియమించింది. మేడ్చల్ మున్సిపాలిటీ జీహెచ్ఎంసీలో విలీనమైన తర్వాత మేడ్చల్, కిష్టాపూర్-పూడూర్ డివిజన్లకు వేర్వేరుగా అధ్యక్షులను ప్రకటించగా, గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవికి కూడా తీవ్ర పోటీ నెలకొంది. నెలల తరబడి జరిగిన చర్చలు, సామాజిక సమీకరణాల అనంతరం గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో గల గౌడవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది.

అయితే ఈ నిర్ణ యం గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌లో తీవ్ర అసంతృప్తికి కారణమైంది. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేసిన గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్‌ను పక్కనపెట్టి సురేందర్ ముదిరాజ్‌కు అధ్యక్ష పదవి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ పదవులతో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ మూకుమ్మడిగా రాజీనామా చేశారు. డీసీసీ అధ్యక్షుడికి పంపిన రాజీనామా లేఖలో, గత ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయని వ్యక్తికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సరైన నిర్ణయం కాదని ఆరోపించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకులను విస్మరించి, కేవలం ఫ్లెక్సీలకే పరిమి తమైన నాయకులకు పదవులు ఇస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే పునఃసమీక్షి ంచి, పార్టీ కోసం కష్టపడ్డ నాయ కులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్, కిష్టా పూర్-పూడూర్ డివిజన్లలో కొత్త అధ్యక్షుల నియామకాన్ని పార్టీ శ్రేణులు స్వాగతిస్తుండగా, గుండ్లపోచంపల్లి డివిజన్‌లో మాత్రం అధ్యక్షుడి నియామకం తీవ్ర వ్యతిరేకతకు దారితీయడం జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. రాజీనా మాలతో గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిర్గతమ య్యాయని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ అసంతృప్తిపై జిల్లా కాంగ్రెస్ నాయకత్వం ఎలా స్పందిస్తుందో, రాజీనామా చేసిన నాయకులతో చర్చలు జరిపి పరిస్థితిని చక్కదిద్దుతుందో లేక నియామకాన్ని యథాతథంగా కొనసాగిస్తుందో అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

**రాజీనామా ప్రకటించిన నేతలు వీరే..**

గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ నరేందర్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సకరబోయిన మల్లేష్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు తాసికాయల కోమలమ్మ, బండారి అనిల్ ముదిరాజ్, కొండ స్వప్న, దానత్ గారి సురేందర్ రెడ్డి, మండల ఉదయ్ గౌడ్, లేబర్ సెల్ మేడ్చల్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సైపెయ మల్లేష్, లేబర్ సెల్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు మండల సంపత్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు సుంకరి కృష్ణ, డివిజన్ మాజీ సేవాదళ్ చైర్మన్ మలిగె కిషన్, -ఎన్ఎస్‌యూఐ మున్సిపల్ అధ్యక్షుడు ప్రవీణ్, సోను కేశన్, నాయకులు మద్దుల మాధవ రెడ్డి, సుంకరి శ్రీనివాస్, రాధాకృష్ణ, టి. నారాయణ రెడ్డి, కొండయ్య, తాసికాయల కోమలమ్మ, మరెపల్లి సుధాకర్, ఫిలిప్స్, షబ్బీర్, గూడ వినోద్ కుమార్, సాగర్, సన్నీ, నవీన్, సుధాకర్, జలారి వెంకటేష్, ప్రసాద్, శ్రీకాంత్, సంతోష్, సుంకరి సత్యనారాయణ, గంగిడి హర్ష, అఖిల్, కొండ భాను చంద్ర్, శ్రీరంగపురం రాజు, వల్లపు ప్రవీణ్, పవన్, హర్షవర్ధన్, నిఖిల్, బండారి ప్రసాద్, బన్నీ, శివాజీ, కావలి భాస్కర్, సుధాకర్, సందీప్ బండారి, వై. అఖిల్, ప్రణయ్ కుమార్, ఆర్. రాము, ఎ. రాజు, వై. సన్నీ, వై. మిస్సు, బి. అరవింద్ కుమార్, క్రాంతి, వై. వరుణ్, శ్రావణ్ కుమార్, బాబు, టి. ఆంజయ్య, దొడ్డ నాగరాజు, జిటగ రాజు, బండారి వెంకట్, వెంకట రమణ, ఆనంద్ , నరసింహ దండ్ల, డి. బాషా, సాయి నారాయణ, కౌశిక్ గూడెం, ఆర్. సురేందర్, ఎస్. కృష్ణ, సీహెచ్. వినయ్ కుమార్, జి. సత్యనారాయణ, వి. నాయుడు, బి. హర్షవర్ధన్ తదితరులు రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



**చేవెళ్ల, జులై 2,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోనే శ్రీనివాస్‌రెడ్డిని నియమించినట్లు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామానికి చేందిన గోనే శ్రీనివాస్‌రెడ్డి పార్టీకి చేసిన సేవలు గుర్తించి ఈ పదవికి ఎంపిక చేశామని తెలిపారు. పార్టీకి సేవలు చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, పార్టీ బలో పేత నం చేసేందుకు శాయశక్తులు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేస్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండలంతో పాటు జిల్లాలోని ప్రతి గ్రామంలో పార్టీ అభివృద్ధికి పాటు పడుతామన్నారు. తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టిన ఎమెల్యే యాదయ్యకు, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

**ఘట్‌కేసర్ రూరల్,జులై 2,ప్రభాతవార్త:** భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని అన్నోజిగూడ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. ప్రతాప్ రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ అన్నోజిగూడ జడ్పీ పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో గురువారం విద్యార్థులచే మొక్కలు నాటించారు. శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమౌతుందని అన్నారు. విద్యార్థులు పర్యావరణం కొరకు మొక్కలు నాటడం, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాందాస్ గౌడ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నోజిగూడ పాఠశాలలో విద్యార్థులచే మొక్కలు నాటిస్తున్న ఉపాధ్యాయులు

## ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించండి



ఓటరు జాబిత నమోదు చేస్తున్న నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, జులై 2,ప్రభాతవార్త:** గ్రామాలలోని ప్రజలకు బీజెపి నాయకులు ఓటరు జాబిత సవరణపై అవగాహన కల్పించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎదిర రాజు అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో మాజి జడ్పిటిసి మచ్చ సుధాకర్‌రావు ఓటరు జాబిత సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సర్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో ఓటరు సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. దీని ద్వారా గ్రామాలలోని ఓటర్లకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. డబుల్ ఓటర్లు, తప్పులు ఉన్న ప్రస్తుతం సరిచేసు కునే అవకాశం వుందని పెర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఓటరు జాబితా సవరణకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యకమ్రంలో బిజెపి జిల్లా నాయకుడు కోనెరు శ్రీనివాస్, బోయ కుర్మయ్య, రాజు, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావం కలిగి ఉండాలి



**జిల్లెడు చౌదరిగూడ,జులై 2,ప్రభాతవార్త:** వైద్య వృత్తిలో ఉన్నవారు సేవాభావం కలిగిగి ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్ణం ప్రహ్లాద్ రావు అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో అమ్మా కంటి వైద్య ధవాఖానను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన నేత్ర పరీక్షలు, అత్యాధునిక కంటి అద్దాలు ఉత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండడం ఎంతో అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆధునిక వైద్య సదుపాయాలు, ముఖ్యంగా నేత్ర సంరక్షణ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. కంటి ఆరోగ్యంపై ప్రజలు నిర్లక్ష ్యం చేయకుండా తరచూ పరీక్షలు చేయించుకోవాలని, చిన్న సమస్యను కూడా నిరక్ష ్యల్ల చేస్తే భవిష్యత్తులో పెద్ద ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని సూచించారు.ప్రస్తుతం డిజిటల్ యుగంలో కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల వినియోగం అధికంగా పెరిగిన నేపథ్యంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు కంటి సమస్యలు పెరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో నాణ్యమైన సేవలు అందించే ఆప్టికల్స్ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ఉత్తమ సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఎదిర రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోనేరు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోయ కుర్మయ్య, చౌడాపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు బంధ్యయ్య రవి తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ పూలింగ్‌కు అంగీకార పత్రాల స్వీకరణ

**ఘట్‌కేసర్ రూరల్, జులై 2,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం కొర్రెములలో ల్యాండ్ పూలింగ్ కొరకు భూ యాజమానుల నుండి అంగీకార పత్రాలు స్వీకరించారు. కొర్రెముల పూర్వపు గ్రామ పంచాయతీ భవనం వద్ద రెవెన్యూ అధికారులు గురువారం భూ యాజమానుల నుండి ల్యాండ్ పూలింగ్ కొరకు అంగీకార పత్రాలు స్వీకరించారు. మండల డీప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ డి. కావ్య ఆధ్వర్యంలో భూ యాజమానుల నుండి అంగీకార పత్రాలు స్వీకరించారు.

భూ యాజమానుల పట్టా భూములకు డెవలప్‌మెంటు చేసిన తర్వాత ఎకరానికి 1620 గజాల నుండి 1670 గజాల వరకు యాజమానులకు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ అసైన్ట్‌భూములకు అయితే ఎకరానికి 600 గజాలు, పీవోటీ కింద ప్రభుత్వం జప్తు చేసిన భూములకు ఎకరానికి 300 గజాల స్థలం కేటాయిస్తామని తెలిపారు. కాగా రైతులు తమకు గతంలో ఇచ్చినట్లుగానే 1700 పైచిలుకు గజాల స్థలం ఇవ్వాలని, సేకరించిన భూమిని ఎన్ని రోజుల్లో ఇస్తారో స్పష్టత ఇవ్వాలని, భూమి ఇచ్చిన తర్వాత తమకు తిరిగి లబ్దిచేకూరే వరకు రైతు భరోసా నిధులు చెల్లించాలని, పంటలు పండిస్తే వచ్చే ఆదాయం కొల్పోతున్నందున దానికి పరిహారం చెల్లించాలని భూ యాజమానులు అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జీపీవోలు సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




రైతుల నుండి అంగీకార పత్రాలు స్వీకరిస్తున్న దృశ్యం

# కుసుమ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

**పూడూరు, జులై 2,ప్రభాతవార్త:** వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు కుసుమపంటను సాగుచేస్తే అధిక లాభాలువచ్చే అవకాశం ఉందని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.ప్రొఫేసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అద్వర్యంలో గురువారం పూడూరు మండలం పరిధిలోని మిట్టకంకల్ గ్రామంలో 60మంది షెడ్యూల్ కులాల రైతులకు వ్యవసాయ పనిముట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రైతులు సంఘంగా ఏర్పడితే అధిక లాభాలనిచ్చే కుసుమ నూనెగింజల సాగుతో పాటు ఇతర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ఎస్‌సి సబ్‌ప్లాన్‌క్రింద ప్రోత్సహిస్తుందని వివరించారు. ఈ ప్రాంత సాగునీటికోసం లక్ష్మీదేవిపల్లిలో ఏర్పాటుచేసే ప్రాజెక్ట్‌కోసం ప్రభుత్వం భూసేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు.రూ.10 వేలకోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణపు పనులు పూర్తయి రెండు కాలువల ద్వారా నీటిని అందిస్తే పరిగి, వికారాబాద్, తాండూరు, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లోని వ్యవసాయ భూములు సస్యశామలంగా మారుతాయన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8వేలకోట్లు అనవసరంగా అప్పుచేసి ప్రజలపై నెట్టి వెళ్లిందని ఆరోపించారు. కడ్మూరు ఈసీనది (పెద్దవాగు)పై వంతెన నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మిట్టకంకల్, కడ్మూరు గ్రామాల వ్యవసాయ భూముల సాగుకోసం గతంలో ఉన్న నీటికత్వలను పునరుద్ధరించేందుకు సాగునీటి అధికారులతో ఎస్టిమేషన్ వేయిస్తానని తెలిపారు. పూడూరులో పండ్లు, పూల మార్కెట్ ఏర్పాటుకోసం స్థల సేకరణకు అధికారులు కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం హరితహారంలో భాగంగా గ్రామంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపాల్, హైకోర్టు న్యాయవాది కడుమూరు ఆనందం, పూడూరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పి రఘునాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ బందయ్య, విశ్వవిద్యాలయం డైరెక్టర్ డా.మాథూర్, ప్రధాన శాస్త్రవేత్త డా.సురేష్, సుధారాణి, రాజేష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సర్పంచి భూపతి రెడ్డి, మాజీ సర్పంచులు శ్యాకుమార్, బి శ్రీనివాస్‌గప్తా, అనంతరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ ఎం సురేష్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్, జిల్లా పార్టీ కార్యదర్శులు ఎస్ శ్రీనివాస్, అజీంపటేల్, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, చిన్నబందయ్య (అనీల్),పలు గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



పూడూరు మండలం మిట్టకంకల్‌లో రైతులకు పనిముట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి,




లాకర్ గదిని పరిశీలిస్తున్న డిఎస్‌పి

## నేరాల నివారణకు పటిష్ట చర్యలు

**పెద్దేముల్, జులై 2, ప్రభాతవార్త:** చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలనితాండూరు డిఎస్‌పి నర్సింగ్ యాదయ్య అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌ను డిఎస్‌పి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసు దస్త్రాలు, మాల్ఖానా, స్టేషన్ నిర్వహణ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే సిబ్బంది, సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా డిఎస్‌పి నర్సింగ్ యాదయ్య మాట్లాడుతూ మండల పరిధిలో ఆస్థి సంబందిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కేమేరాల ఏర్పాటుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలు చేయాలని స్టేషన్ హౌస్ ఆఫిసర్‌ను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చె ప్రతి పిర్యాదుదారునితో మర్యాద పూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తాండూరు రూరల్ సిఐ ప్రవీన్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాంకీ డంపింగ్ యార్డు బేషరతుగా ఎత్తివేయాలి

**జవహర్ నగర్, జులై 2, ప్రభాతవార్త:** జవహర్ నగర్‌లోని రాంకీ చెత్త డంపింగ్ యార్డును బేషరతుగా ఎత్తివేసి ప్రజలను కాలుష్య సమస్యల నుంచి రక్షి ంచాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ, యాంటీ డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కీసర సర్కిల్ పరిధిలోని బండ్లగూడ రాజీవ్ గృహకల్పలో జవహర్ నగర్ జేఏసీ చైర్మన్ షేక్ షావలి, దమ్మాయిగూడ జేఏసీ అధ్యక్షుడు ఎం. సమ్మిరెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు స్థానిక నాయకులు ఈగ రాజు, జవహర్ నగర్ మాజీ ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మా గౌడ్ నాయకత్వంలో జేఏసీ నేతలు డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చెత్తకుప్పల కారణంగా కలుషితమైన చెరువులు, నేలలను పరిశీలించిన వారు డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్గంధం, కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు పూర్తిగా తొలగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్‌పి జాతీయ నాయకుడు జానకిరామ్ మాట్లాడుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. డంపింగ్ యార్డు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవించే హక్కులను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ విధానాలతో యుద్ధ ప్రాతిపదికన డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకుడు టి. శివన్నారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు గడ్డం సదానందం, మాజీ ప్రజాప్రతినిధి ఎ. సుబ్రమణ్యం, పీఓడబ్ల్యూ (విముక్తి) నాయకురాలు పెర్క సునీత, టీయూసీఐ నాయకుడు వి. ప్రవీణ్, బీఎన్ఆర్‌కేఎస్ నాయకుడు సూర వెంకటయ్య, పీఓడబ్ల్యూ నాయకురాలు లక్షీ ్మబాయి, నాగారం అశోక్, రాజీవ్ గృహకల్ప అధ్యక్షుడు పోతరాజు రాములు, కార్యదర్శి ఈగరాజు, సలహాదారు నర్సింహ్మా, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. నరేష్, సీపీఎం నాయకులు విజయ్ కుమార్, జాన్, వినయ్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు శ్వేతరాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో అదృశ్యమైన వ్యక్తి, మిస్సింగ్ కేసు నమోదు

**జవహర్‌నగర్, జులై 2. ప్రభాతవార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ మార్వాడి లేన్‌కు చెందిన రావికంటి ఈశ్వర్ (44) ఈ నెల 30వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో తన స్కూటీపై ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు సమాచారం. వెళ్లే సమయంలో తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే వదిలి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వర్ తనకు తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసిన కారణంగా మానసిక ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయి ఉండవచ్చని ఆయన భార్య రజిత జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈశ్వర్ గురించి ఏదైనా సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు తెలియజేయాలని పోలీసులు కోరారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**కుల్కచర్ల,జులై 2. ప్రభాతవార్త:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బిజెపి మండల ఉపాధ్యక్షులు వార్డు సభ్యులు కొండ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామ పంచాయతీలో 4వ వార్డులో పరిశుధ్య కార్మికులతో మురగు కాల్వలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... వర్షకాలం పరిసరాలు ఎప్పట్టికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేని ఎడల దోమలు, క్రీములకీటకాల భారిన పడల్సి వస్తదని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు.



మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తున్న ఆంజనేయులు



విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేస్తున్న సర్పంచ్ రమేష్

## విద్యతో పాటు క్రీడలలో రాణించాలి

**కేశంపేట, జులై 2, ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో రాణించాలని చింతకుంటపల్లి గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహకంగా క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, వాటితో పాటు అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయన్నారు, విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవగ్నులైన ఉపాధ్యాయులు ఉంటారని ప్రస్తుతము ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు గతంలో ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్న వారు ఉన్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సుచరిత, షాహీన్, వార్డ్ సభ్యులు పల్లెమోని కళమ్మ, డోలా శంకర్, గ్రామ యువకులు మల్లేష్ యాదవ్, నవీన్, శ్రీకాంత్, రాజు, శ్రీశైలం, రాజేందర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను పరిశీలిస్తున్న అధికారులు

## ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లతో అధిక దిగుబడులు

**వికారాబాద్, జులై 2, ప్రభాతవార్త:** వ్యవసాయంలో నీటి పొదుపు, కలుపు నివారణ, నాణ్యమైన అధిక దిగుబడుల సాధనకు ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లు ఎంతో ఉపయోగకరమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి ఎంఏ సత్తార్ అన్నారు. ఈ సందర్భంగా ఎంఏ సత్తార్ మాట్లాడుతూ మొక్కల చుట్టు ఉన్న నేల భాగాన్ని ప్లాస్టిక్ షీట్‌తో కప్పె విధానాన్ని మల్చింగ్ అంటారని అన్నారు. ఈ పద్దతిని అనుసరించడం వల్ల సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు అందకపోవడంతో సుమారు 85 శాతము వరకు కలుపు నివారణ జరుగుతుందని అన్నారు. దీంతో కలుపు మందుల వినియోగం తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని అన్నారు. వర్షపు నీరు లేదా సాగునీరు నేరుగా నేలపై పడకుండా ఉండటంతో నేల కొత తగ్గి భూసారం సంరక్షింపబడుతుందని అన్నారు. దీనివల్ల మొక్కలు పోషకాలను సమర్ధవంతంగా గ్రహించి ఆరోగ్యంగా పెరుగుతాయని అన్నారు. డ్రిప్ సేద్యంతో కలిపి మల్చింగ్‌ను వినియోగించడం వల్ల ఎరువులు, నీరు నేరుగా మొక్కల వేర్లకు చేరి వృథా కాకుండా ఉంటుందని అన్నారు. భూసార పరిక్షల ఆదారంగా సమతుల్య ఎరువుల వినియోగంతో మెరుగైన ఫలితాలను సాదించవచ్చని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వికారాబాద్ జిల్లాకు 952 ఎకరాల ప్లాస్టింగ్ మల్చింగ్ లక్ష్యాన్ని ప్రభుత్వం కేటాయించందని అన్నారు. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ప్రభుత్వం రాయితి అందజేయనుందని అన్నారు. రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్‌కార్డు,బ్యాంకు ఖాతా వివరాలతో సమీప ఉద్యాన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని, ఈ అవకాశాన్ని సద్వినీయోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రాంరెడ్డిపల్లి లోనే రేషన్ ఇవ్వాలి

**కుల్కచర్ల, జులై 2 ప్రభాతవార్త :** రాంరెడ్డిపల్లి లోనే రేషన్ డిలర్ కేంద్రా న్ని ఏర్పాటు చేయాలని సర్పంచ్ నరసింహులు యాదవ్ అధికారులకు విజ్ఞప్తిచేశారు. గురువారం గ్రామ నాయకులతో కలిసి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింహులు యాదవ్ మాట్లాడుతూ... రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి అవుతుందని, ఇప్పటి వరకూ రెషన్ డిపో ఏర్పాటు చేయాలని అవేదన వ్యక్తచేశారు. గ్రామస్తులు ప్రతి నెల రెషన్ సరుకుల కోసం 40 సంవత్సరాలుగా రెండు కిలోమీట్ల దూరం నడిచి వెళ్లి తెచ్చు కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. వృద్ధులు వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.



ఆర్‌డిఓకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ నరసింహులు యాదవ్




అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ

## ప్రపంచానికి ఆదర్శంగా లయన్స్‌క్లబ్ సేవలు

**ఆమనగల్లు, జులై2, ప్రభాతవార్త:** సమాజ శ్రేయస్సు కాంక్షిస్తూ లయన్స్‌క్లబ్ చేపడుతున్న సేవలు నేడు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఇమీడియట్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ జి మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. సమాజ సేవలో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని పేదలకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు 41వ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆమనగల్లులో స్థానిక కళ్యాణిగార్డెన్స్‌లో నిర్వహించారు. ఈమేరకు క్లబ్ నూతన అధ్యక్షునిగా ఎంగలి బాలకృష్ణ కార్యదర్శిగా గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా గంప శ్రీనివాస్ గుప్తా, క్లబ్ పిఆర్‌ఓ యంఎ పాషతోపాటు ఇతర క్లబ్ కార్యవర్గసభ్యులతో మాజీ మల్టిబుల్ చైర్మన్ సందడి నరేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లైన్ జూలూరు రమేష్ బాబు, రీజన్ చైర్పర్సన్ డాక్టర్ ఏ ప్రశాంత్ రెడ్డి, జోన్ చైర్‌పర్సన్ బిఆర్.రాంరెడ్డి, పిఆర్‌ఓ పాష , లియో క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌లతోపాటు సీనియర్ సభ్యులు, మాజీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజాపాలన ముగింపు ర్యాలీ

**ఆమనగల్లు, జులై2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి నివేదిక కార్యక్రమంతో ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువయిందని ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యనాయక్, ఏఎంసి మాజీ ఉపాధ్యక్షుడు గుర్రం కేశవులు అన్నారు. 99రోజుల ప్రగతి నివేదికలో ప్రభుత్వశాఖల నాణ్యవంతంగా సేవలందాయని చెప్పారు. ప్రజాపాలన- ప్రగతి నివేదిక సందర్భంగా చేపట్టిన బస్సుయాత్ర ముగింపు సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో గురువారం నిర్వహించిన భారీ బహిరంగసభకు ఆమనగల్లు నుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ర్యాలీగా తరలివెళ్ళారు. ఈమేరకు పత్యనాయక్ గుర్రం కేశవులుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా పట్టణంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభకు తరలివెళ్ళారు.

## సర్‌లో పొరపాట్లు రావద్దు



చీలాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర, తహశీల్దారు విజయ్‌కుమార్

**పూడూరు, జులై 2, ప్రభాతవార్త :** ఎస్ఐఆర్‌లో ఎలాంటి పొరపాట్లులేకుండా చూడాలని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర పేర్కొన్నారు. గురువారం పూడూరు మండలం పరిధిలోని చీలాపూర్,పెద్ద ఉమ్మెంతాల్, కంకల్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వేలో భాగంగా ఇస్తున్న ఫాంలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నింపేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు విజయ్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం




**కుల్కచర్ల, జులై 2, ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని సర్పంచ్ మల్లేష్, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ఎముకంటి నర్సమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందడంతో రూ. 175000 వేల చెక్కును స్థానిక నాయకులతో కలిసి బాధితులకు అందజేశారు. ఈ సందంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూర్ సర్పంచ్ తిరుపతయ్య, కాంగ్రెస్ సినియర్ నాయకులు కృష్ణరెడ్డి, బాల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షులు వెంకటయ్య, రాఘవేందర్, ఫిల్డ్‌అసిస్టెంట్ నర్సింలు, వార్డు సభ్యులు ఆంజనేయులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు నోటుబుక్ లు పంపిణీ చేసిన సీనియర్ నాయకులు వేణు గోపాల్ రెడ్డి

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**ధారూర్, జులై 2, ప్రభాతవార్త:** ధారూర్ మండలంలోని తరిగోపుల గ్రామంలో స్థానిక సీనియర్ నాయకులు కె. వేణుగోపాల్ రెడ్డి పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు.

మాజీ శాసనసభ్యులు డాక్టర్ మెతుకు ఆనంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నోట్ పుస్తకాలు, పెన్నులను, గురువారం తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు వేణుగోపాల్ రెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 200 మంది విద్యార్థులకు ఈ సామగ్రిని అందించారు.

ఈ సందర్భంగా, పదవ తరగతి ఫలితాల్లో తరిగోపుల పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుల కృషిని అభినందిస్తూ ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. అలాగే, విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజా ప్రతినిధులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పట్టణంలో పోలీసుల తనిఖీలు

**-15 గ్రాముల గంజాయి, పలు వాహనాలు స్వాధీనం**


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు బుధవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.

వికారాబాద్ డీఎస్పీ పర్యవేక్షణలో పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, నిర్మానుష్య ప్రాంతాలు, రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, ఐదుగురు సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు పాల్గొని పాపులాన్ యంత్ర సహాయంతో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

తనిఖీల సందర్భంగా బస్ స్టాండ్ సమీపంలో సుమారు 15 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. వాహనాలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను చూపించలేకపోయిన 8 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.

ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని నియంత్రించడం, దొంగతనాలు, ఇతర నేరాలను నివారించడం, ప్రజలకు సురక్షి తమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా చర్యలు చేపట్టడం జరిగింది అని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య తెలిపారు.

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు వికారాబాద్ సబ్ డివిజన్ పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని డీఎస్పీ తెలిపారు.

# ప్రజాస్వామ్యానికి ఓటే బలమైన ఆయుధం..

**-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి**
**-సిద్ధాపూర్, కొడిచెర్ల, కొడిచెర్ల తాండ, వైఎం తాండలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం**


ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి,ఇతర నాయకులు,తాండ వాసులు

**కొత్తూర్, జులై 2, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పటిష్టం చేయాలంటే అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తూరు మండలం సిద్ధాపూర్ పరిధిలోని చింతగట్టు తాండ, కొడిచెర్ల, కొడిచెర్ల తాండ, వైఎం తాండ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచులు బాసు నాయక్, కొర్ర శాంతి విష్ణు నాయక్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్లారం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత నుంచి ఫారం6 దరఖాస్తులను స్వీకరించడంతో పాటు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వోలు) సూచించారు. అడ్రస్ మార్పు, వివరాల సవరణ, అనర్హుల తొలగింపు వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తులను కూడా ప్రజలు సమర్పించాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు కూడా ఓటరు జాబితాకు దూరం కాకుండా ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ప్రజల మధ్యే ఉంటూ వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడిచెర్ల చంద్రశేఖర్ రెడ్డి, సిద్ధాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.కే. కాజా, కొడిచెర్ల తాండ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాము నాయక్, వైఎం తాండ గ్రామ కమిటీ అధ్యక్షుడు సంతోష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎకో టౌన్‌కు 86 ఎకరాల భూమి బదిలీకి ప్రభుత్వం ఆమోదం

**-జీవో ఆర్‌టీ నెం. 641 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**
**-ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు**
**-జపాన్ సహకారంతో ఎకో టౌన్ అభివృద్ధికి ముందడుగు**

**కొత్తూరు, జులై 2,ప్రభాతవార్త:** కొత్తూర్ మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో ఎకో టౌన్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసి) పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) సదుపాయాల ఏర్పాటుకు సిద్ధాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 252, 278, 361లోని మొత్తం 86 ఎకరాల భూమిని వినియోగించేందుకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (జీహెచ్ఎంసీ2) శాఖ గురువారం జీవో ఆర్‌టీ నెం. 641ను జారీ చేసింది.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం మరియు జపాన్‌లోని ఫుకూకా ప్రిఫెక్చర్‌లోని కిటాక్యూషు నగరాల మధ్య కుదిరిన స్నేహ, సహకార ఒప్పందంలో భాగంగా సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధి, నెట్‌జీరో లక్ష్యాల సాధన కోసం సిద్ధాపూర్‌లో ఎకో టౌన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధీనంలోని 86 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీకి ఉచితంగా బదిలీ చేశారు. అనంతరం హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (హైఎంఎస్‌డబ్ల్యూ)కు ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేక అధికారి (క్యూర్) అనుమతులు మంజూరు చేశారు. ఈ చర్యలను ప్రభుత్వం పరిశీలించి అధికారికంగా ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ ఉత్తర్వులతో సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత ఎకో టౌన్, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు పరిపాలనా పరంగా మార్గం సుగమమైంది. అదేవిధంగా ఇక్కడ ఏ కోట వద్దు అంటూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక ప్రజలు ఆయా గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు ఇటీవల శ్రీకారం చుట్టారు అయితే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో దీనిపై ముందడుగు వేయదని ఎమ్మెల్యే భరోసాతో ఆందోళన విరమించారు ఇప్పుడు కథ మొదటికి రావడంతో ఏం జరుగుతుందో వేచి చూడాలి..

# ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత కుదింపు తగదు


విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

**కొడంగల్,జులై 2,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత కుదింపు తగదని స్వేరోస్,వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్నారు.గురువారం కొడంగల్‌లో తెలంగాణా ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్,స్వేరోస్ రాష్ట్ర నాయకులు బోడ వెంకటేష్,బీసీ సేన జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ దేశం కోసం 26 సంవత్సరాల పాటు ప్రాణాన్ని ఫణంగా పెట్టి దేశ రక్షణకై దేశం సమగ్రతపై పాటుపడుతూ పనిచేసిన వ్యక్తికి లక్షల మందికిపైగా జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతమైన వ్యక్తికి కుట్ర పూరితంగా భద్రతను తగ్గించడం ఓ పథకం ప్రకారం కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ప్రవీణ్‌కుమార్‌కు ఏదైతే గత ప్రభుత్వం ఇచ్చిన సెక్రటరీ,బుల్లెట్ ప్రూఫ్ కారుతో పాటు 2ప్లస్ జడ్‌ప్లస్ భద్రతను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.లేని పోంలో తెలంగాణా రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల తరపున స్వేరోస్,ప్రజా సంఘాల అద్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రదాన కార్యదర్శి గౌరిగల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ ప్రాజెక్టులో జయశ్రీ సేవలు మరువలేనివి


పదవీ విరమణ పొందిన జయశ్రీ దంపతులను సన్మానిస్తున్న డిడబ్ల్యుఓ కాంతారావు

**కొడంగల్,జులై 2,ప్రభాతవార్త:** ఐసీడీఎస్ కొడంగల్ ప్రాజెక్టులో సూపర్‌వైజర్‌గా విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన జయశ్రీ సేవలు మరువలేనివని డీడబ్ల్యుఓ కాంతారావు అన్నారు.కొడంగల్ ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తు పదవి విరమణ పొందిన జయశ్రీ సన్మాన కార్యక్రమం గురువారం మండల పరిధిలోని పర్సా పూర్ రైతు వేదికలో గ్రామ సర్పంచ్ కే.రాధశ్రీనివాస్‌రెడ్డి అద్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జయశ్రీ దంపతులను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి హజరైన డీడబ్యుఓ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడు మంచి గుర్తింపు ఉంటుందన్నారు.జయశ్రీ విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తు సేవలందించారని గుర్తు చేశారు.బాల్య వివాహలను అరికట్టడం,కిశోరబాలికలు,బాలింతలు,చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో ఎంతో కృషి చేశారని అమె సేవలను కొనియాడారు.సమావేశంలో గ్రామ సర్పంచ్ కే.రాధశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విధుల పట్ల అంకిత భావం,నిబద్దతతో సేవలందిస్తు అంగన్‌వాడీల బలోపేతానికి జయశ్రీ ఎంతో కృషి చేశారని,పదవి విరమణ అనంతరం అమె కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి సీడీపీఓ జయరాంనాయక్, వికారాబాద్,పరిగి,తాండూర్,కొడంగల్ ఐసీడీఎస్ సీడీపీఓలు,సూపర్‌వైజర్‌లు,అంగన్‌వాడీ టీచర్లు తదితరులు జయశ్రీ దంపతులను శాలువా,పూలమాలలతో సన్మానించారు.

# మేడ్చల్ అసెంబ్లీ లోని డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం


టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 2,ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని మేడ్చల్ నియోజకవర్గంకు సంబంధించి ఉన్న మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ఆయా 16 డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వీటికి సంబంధించిన డివిజన్ల వారీగ అధ్యక్షుల నియామకం జులై 1న ఉత్తర్వులు జారీ అయ్యాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ప్రతిపాదనల మేరకు డివిజన్ల వారీగ ఆ రెండు మున్సిపాల్టీలకు సంబంధించిన కాంగ్రెస్ డివిజన్ల అధ్యక్షులను నియమించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సురేందర్‌ముదిరాజ్, మేడ్చల్ డివిజన్‌కు నడికొప్పు నాగరాజు(చాపరాజు), పూడురు-కిష్టాపూర్ డివిజన్‌కు రాయపల్లి మల్లేశ్‌గౌడ్‌లు నియమితులయ్యారు. అదేవిధంగా శామీర్‌పేట డివిజన్‌కు నక్క సందీప్‌గౌడ్, జవహర్‌నగర్ డివిజన్‌కు డి.శాంతిగౌడ్, చంద్రపురికాలనీ డివిజన్‌కు ఎం.శ్రీకాంత్‌యాదవ్, దమ్మాయిగూడ డివిజన్‌కు ముప్ప రామారావు, కీసర డివిజన్‌కు రామిడి స్వప్నారెడ్డి, నాగారం డివిజన్‌కు ఇలసాని భూమయ్యయాదవ్, ఘట్‌కేసర్ డివిజన్‌కు బొక్క ప్రభాకర్‌రెడ్డి, ఎదులాబాద్ డివిజన్‌కు సమ్మాల అమర్, పోచారం డివిజన్‌కు కర్రె రాజేశ్, మేడిపల్లి డివిజన్‌కు రవి తుంగతుర్తి, ఫీర్జాదిగూడ డివిజన్‌కు బండి శ్రీరాములుగౌడ్, బోడుప్పల్ డివిజన్‌కు బొమ్మ కల్యాణ్, చెంగచర్ల డివిజన్‌కు పోగుల దిలీప్‌రెడ్డిలు నియమితులను నియమిస్తూ టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. .రానున్న మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల కోసం డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి, త్వరలో జరిగే ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సమాయత్తం కోసం డివిజన్‌లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించినట్లు స్పష్టం అవుతుంది. అయితే మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మూడు డివిజన్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోవి ఉండగ, మిగతా 13డివిజన్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోకి సంబంధించిన డివిజన్లు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకంకు సంబంధించి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నట్లు తెలుస్తుంది.

# కేంద్ర ప్రభుత్వం విద్యారంగంపై అవలంభిస్తున్న తీరుపై ఎస్‌ఎఫ్‌ఐ నిరసన ర్యాలీ



అలియాబాద్ చౌరస్తా వద్ద ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**శామీర్‌పేట, జులై 2,ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం విద్యారంగంపై అవలంభిస్తున్న తీరుపై ప్రజావ్యరేక విధానాలను నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. శామీర్‌పేట మండల ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో అలియాబాద్ గ్రామ పరిధిలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థ బిజెపి ప్రభుత్వం పూర్తిగ సంక్షోభం లోకి నెట్టిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా నీట్, ఇతర జాతీయ ప్రవేశ పరీక్షలలో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వాహణలో జరిగిన తీవ్రమైన నిర్లక్ష్యం, సిబిఎస్ఇ ఫలితాల నిర్వాహణలో ఏర్పడుతున్న సమస్యలు, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, లక్షలాది మంది విద్యార్థుల భవిషత్ అంధకారంలోకి నెడుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉన్న నమ్మకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగ దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. నీట్ పరీక్షలో అవతవకలు వెలుగులోకి వచ్చినప్పటికీ, విద్యార్థుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని, పలువురు విద్యార్థులకు తప్పుడు హాల్‌టికెట్లు జారీ కావటం, పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ తీవ్ర గందరగోళం నెలకొందని కొందరు విద్యార్థులకు నష్టం జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిషత్‌తో చలగాటం ఆడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయనతో పాటు శామీర్‌పేట మండల ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షులు వినయ్, నాయకులు రాజశేఖర్, రాజు, అభినయ్, సుధీర్, రామ్, నవీద్, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ప్రతిభ చాటిన ఎన్‌ఎఫ్‌సినగర్ కెవి విద్యార్థిని



కృతి ఇంటర్న్‌షిప్‌లో అవార్డు పొందిన ఎన్ఎఫ్‌సీనగర్ కేవీ బృందంతో అనన్య అప్రమిత

**ఘట్‌కేసర్, జులై 2,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థిని అనన్య అప్రమిత ప్రతిష్టాత్మక ఖరగ్‌పూర్ ఐఐటీ నిర్వహించిన 'కృతి' ఆరు వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి విశిష్ట ప్రతిభ కనబరిచింది. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఆమె సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పొఫెసర్ అమిత్‌సాస్సి మార్గదర్శకత్వంలో వినూత్న ప్రాజెక్టును రూపొందించింది. అనంతరం నిర్వహించిన 'ప్రవాహ్' ఎగ్జిబిషన్‌లలో తన బృందంతో కలిసి ఆప్రాజెక్టును ప్రదర్శించింది. ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థుల సమక్షంలో జరిగిన ఈప్రదర్శనలో సివిల్, మెకానిక్, కెమికల్ ఇంజనీరింగ్-ట్రాక్ 3 విభాగంలో వారి ప్రాజెక్టు అవార్డును సొంతం చేసుకుంది. అనన్య సాధించిన ఈవిజయం ఆమె ప్రతిభ, పరిశోధనా దృక్పథం, అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలో ఆమె సాధించిన ఈఘనత ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయంకు గర్వ కారణంగా నిలవడమే కాకుండా ఇతర విద్యార్థులకు స్పూర్తిదాయకంగా మారింది. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అనన్యను అభినందిస్తూ ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నూతన బాధ్యతలు చేపట్టిన ఇద్దరు నాయకులు

**- జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలిగా మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్. బాధ్యతలు**
**- చంద్రపురి డివిజన్ అధ్యక్షుడిగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్**

**జవహర్ నగర్, జులై 2,ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారిద్దరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.జీహెచ్ఎంసీ మాజీ మేయర్‌గా ప్రజాసేవలో విశేష అనుభవం సంపాదించిన శాంతి కోటేష్ గౌడ్‌కు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మేయర్‌గా పనిచేసిన సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆమె చూపిన చొరవ, నాయకత్వ అనుభవం జవహర్ నగర్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.అదేవిధంగా చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన మల్లెపూల శ్రీకాంత్ యాదవ్‌కు కూడా కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల సమస్యలపై స్పందించే నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు.పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం, పార్టీని గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడం కోసం ఇద్దరు నాయకులు కృషి చేయాలని నాయకులు కోరారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మాట్లాడుతూ శాంతి కోటేష్ గౌడ్ అనుభవం, శ్రీకాంత్ యాదవ్ సేవాభావం పార్టీకి మరింత బలం చేకూరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఇద్దరు నాయకుల పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షి స్తూ అభినందనలు తెలిపారు.

## చాపరాజుకు మేడ్చల్ కాంగ్రెస్ బాధ్యతలు

**మేడ్చల్, జులై 2, ప్రభాతవార్త :** ఒకప్పుడు ఉమ్మడి మేడ్చల్ మండలంలో మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్లపోచంపల్లి డివిజన్ ప్రాంతాలతో పాటు ఎల్లంపేట మున్సిపాలిటీ కూడా ఉండేది. అప్పట్లో మొత్తం ప్రాంతానికి ఒకే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉండేవారు. ప్రస్తుతం పరిపాలనా పునర్వ్యవస్థీకరణతో అదే ప్రాంతంలో వేర్వేరు డివిజన్లకు వేర్వేరు అధ్యక్షులను నియమించడం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని విస్తరించింది. ఈ నియామకాలతో స్థానిక కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. అదే సమయంలో అధ్యక్ష పదవిని ఆశించిన పలువురు నాయకులు అవకాశం కోల్పోయినా, పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పనిచేయాలని అధిష్ఠానం సూచించినట్లు తెలుస్తోంది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డివిజన్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశ్యంగా నాయకులు పేర్కొంటున్నారు. ఉమ్మడి మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో కొనసాగిన పార్టీ నిర్మాణం, కాలక్రమేణా జరిగిన పరిపాలనా మార్పులతో పూర్తిగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం డివిజన్ల వారీగా అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది.గతంలో మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్ష పదవిని ఆశిస్తూ సుమారు 23 మంది నాయకులు పోటీ పడగా, గుండ్లపోచంపల్లి ప్రాంతంలో కూడా 20 మందికి పైగా ఆశావహులు బరిలో నిలిచారు. పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంది.మేడ్చల్ మున్సిపాలిటీ జీహెచ్ఎంసీలో విలీనమైన తర్వాత ఆ ప్రాంతాన్ని మేడ్చల్ డివిజన్, కిష్టాపూర్-పూడూర్ డివిజన్లుగా విభజించారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చాపరాజు, కిష్టాపూర్-పూడూర్ డివిజన్ అధ్యక్షుడిగా మల్లేష్ గౌడ్‌కు బాధ్యతలు అప్పగించారు. వీరిద్దరూ గత మేడ్చల్ మున్సిపాలిటీలో కౌన్సిలర్లుగా పనిచేసిన అనుభవం కలిగిన నాయకులు. అదే విధంగా గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవికి కూడా తీవ్ర పోటీ నెలకొనగా, చివరకు గతంలో గౌడవెల్లి సర్పంచ్‌గా పనిచేసిన సురేందర్ ముదిరాజ్‌కు పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది.

# ఘట్‌కేసర్, ఎదులాబాద్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం


ఘట్‌కేసర్, ఎదులాబాద్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, అమరేందర్‌లను సన్మానిస్తున్న డిసిసి ఉపాధ్యక్షులు మహేశ్‌గౌడ్

**ఘట్‌కేసర్, జులై 2,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులుగా బొక్క ప్రభాకర్‌రెడ్డి, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షులుగా సామల అమరేందర్‌లు నియమితులయ్యారు. ఈమేరకు టిపిసిసి అధ్యక్షులు-ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ వారి నియామకాల ఉత్తర్వులను జారీ చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని డివిజన్‌లకు అధ్యక్షుల జాబితాను డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఆమోదంతో పంపగా టిపిసిసి చీఫ్ నియమించారు. గురువారం మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేయగా ఆయన ఇద్దరు అధ్యక్షులను శాలువాలు కప్పి సన్మానించారు. ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షులుగా బొక్క ప్రభాకర్‌రెడ్డిని నియమించారు. ఆయన ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం డైరక్టర్‌గా, ఎన్ఎఫ్‌సీనగర్ పంచాయతీసభ్యులుగా పనిచేశారు. ఘట్‌కేసర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తుండటంతో ప్రభాకర్‌రెడ్డికి డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సామల అమరేందర్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం కీసరగుట్ట డైరక్టర్‌గా కొనసాగుతున్నారు. ఎదులాబాద్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులుగా అమరేందర్ పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో ఎదులాబాద్ డివిజన్ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రెడ్డి, అమరేందర్‌లు డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టిపిపిసి సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ముంచుకొస్తున్న నీటి గండం?

(మొదటి పేజీ తరువాయి)

చిన్న తరహా చెరువులు, కుంటలు సైతం ఎండిపోయి వెక్కిరిస్తున్నాయి.

**యాసంగిలో ఆరుతడి వైపు వెళ్లాల్సిందేనా?**

రానున్న రోజుల్లో వాతావరణం అనుకూలించని పక్షంలో, రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందువల్ల రాబోయే యాసంగి సీజన్‌లో ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా, బోరు బావుల కింద కేవలం ఆరు తడి పంటలను మాత్రమే వేసుకునేలా రైతులను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

**ప్రజల్లో అవగాహన పెంచాలి..**

నీటి సంక్షోభం ఇంతలా ముంచుకొస్తున్నా గృహ వినియో గదారుల్లో బాధ్యతారాహిత్యం కొరవడటం ఆందోళన కలిగిస్తోంది. పబ్లిక్ ట్యాపులను ఆఫ్ చేయకుండా వదిలేయడం, వాహనాలు కడగడానికి, ఇళ్లు శుభ్రం చేయడానికి తాగునీటిని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారు. దీనిపై స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి తరచూ అవగాహన సదస్సులు నిర్వహించాలని, నీటిని పొదుపుగా వాడుకునేలా ప్రజలను చైతన్యపరచాలని జిల్లా భూగర్భజలవనరుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవి హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే 2027 వేసవి నాటికి జిల్లాలో నీటి ఎద్దడి ఊహించని భయానక రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తోంది.